అరుదైన చెట్లు... అదిరేట్టు

ఆకట్టుకుంటున్న ఉప్ప చెట్లు

• పర్యాటకులను కట్టిపడేస్తున్న అందాలు • బంగారంగరువుకు తరలివస్తున్న సందర్శకులు



ఉప్ప చెట్లు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

హుకుంపేట: మన్యంలో ఎటు చూసినా ప్రకృతి అందాలు కట్టిపడేస్తాయి. ఎటుచూసినా పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలను తాకుతున్న మేఘాలు.. జాలువారుతున్న జలపాతాలు చల్లని ప్రశాంత వాతావరణం కనువిందు చేస్తోంది.. ఈ కారణంగానే ఏటా మన్యంలో ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. మన్యంలో అటవీ సంపదకు పెట్టింది పేరు.. ఇక్కడి అటవీ సంపదకు మైదాన ప్రాంతాల్లో విపరీతమైన గిరాకీ ఉంది. మన్యంలో ఔషధ గుణాలున్న చెట్లు అనేకంగా దర్శనమిస్తున్నాయి. ఈ వృక్షాలు బంగారం, నీలం, పసుపు తదితర రంగుల్లో ఆకట్టుకుంటాయి.

స్వర్ణ కాంతుల్లో మిరిమిట్లు గొలిపే మేఘూవా చెట్లు తూర్పు కనుమల్లో పలుచోట్ల ఔషధ గుణాలున్న అరుదైన మేఘూవా ఫెరె చెట్లు ఉన్నాయి. ఇవి బంగారు వర్ణంలో ఆకట్టుకుంటాయి. మండలంలోని దుర్గం పంచాయితీ మారుమూల బంగారంగరువు గ్రామంలోని సుమారు 25 ఎకరాల్లో సుమారు 1500 చెట్లు ఉన్నాయి. ఈ చెట్లు వల్లే ఆ గ్రామానికి బంగారంగరువు అని పేరొచ్చినట్టు గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 1.050 మీటర్లు ఎత్తులో ఉంది. ఈ జాతి చెట్లను వైద్య, వాణిజ్య అవసరాలకు చాలా విలువైందని స్థానికులు చెబుతారు. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల మధ్య ఈ చెట్లు చిగురిస్తాయి. వీటి ఆకులు వివిధ రంగుల్లో ఆకర్షణీయమం కనిపిస్తాయి.

ఈ చెట్ల ఆకులు మొదట లేత ఎరుపు రంగు, తరువాత గోధుమ రంగు, ఆ తర్వాత లేత ఆకుపచ్చ రంగు, చివరగా పూర్తి ఆకుపచ్చ రంగులోకి మారుతూ కనువిందు చేస్తాయి. వివిధ రంగుల్లో దర్శనమిస్తున్న ఈ చెట్లు ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలను రెట్టింపుజేస్తాయి. ఈ సీజనల్‌లో ఈ చెట్లను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. వీటి పువ్వులు తెలుపు రంగులో పెద్దవిగా ఉంటాయి. వీటిని గిరిజన స్త్రీలు అలంకారణ కోసం ఉపయోగిస్తారు. మంచి సువాసన ఉండడంతో వాణిజ్య పరంగా సుగంధ ద్రవ్యాల తయారిలో వినియోగిస్తారు. ఈ ప్రాంతంలో కనువిందు చేస్తున్న ఈ విభిన్న రంగుల్లో దర్శనమిస్తున్న చెట్ల అందాలపై రెండేళ్ల క్రితం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అప్పటి నుంచి వీటిని చూసేందుకు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో పర్యాటకులు ఈ ప్రాంతానికి తరలివస్తున్నారు.



వివిధ రంగులతో ఆకట్టుకుంటున్న ఉప్ప చెట్లు

అభివృద్ధి చేయాలి



ఎంతో సుందరంగా ఉన్న ఈ ఉప్ప, బంగారం చెట్లు తోటలను ఐటీడీఏ అధికారులు చొరవతీసుకుని పర్యటక ప్రాంతాంగా అభివృద్ధి చేయాలి.వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా దర్శమిస్తున్న ఈ చెట్టు మరెక్కడ లేకపోవడం విశేషం. ఈ అందాలను చూసేందుకు పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బడ్నాయిని బాలన్న, మాజీ ఎంపీటీసీ, దుర్గం సెగ్మెంట్

ప్రకృతి అందాలు రెట్టింపు



ఉప్ప, బంగారం చెట్లు చాలా అద్భుతంగా ఉన్నాయి. రాష్ట్రంలో అరుదుగా కనిపించే ఈ చెట్లను సందర్శించడం చాలా సంతోసంగా ఉంది. ఇక్కడ వచ్చిన తరవాత ఏదో కొత్తలోకంలో వచ్చినట్టు ఉంది. ఈ ప్రాంతంలో ఉన్న చెట్లు ఇక్కడ ప్రకృతి అందాలను రెట్టింపుజేస్తున్నాయి.

–వినయ్, పర్యాటకుడు, విశాఖపట్నం

భారీగా పర్యాటకులు



రాష్ట్రంలో అరుదుగా కనిపించే ఈ ఉప్ప చెట్లు గురించి 'సాక్షి' పత్రికలో రెండేళ్ల క్రితం పర్యాటకులకు పరిచయం అయింది. దీంతో ఈ ఏడాది నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. ముఖ్యంగా జనవరి, ఫిబ్రవరిలలో ఈ చెట్లు వివిధ రంగుల్లో దర్శనమిస్తుంటాయి. వీటిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. వారు బస చేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి.

– ఓరబోయిని మత్స్యరాజు, బంగారంగరువు, గ్రామం

క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా



మండల పరిషత్ సమావేశ మందిరం

అడ్డతీగల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో సోమవారం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. కోడ్ అమలులోనికి రాకముందే మండల సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని సభ్యులందరికీ తెలియజేశారు. ఈ మేరకు సమావేశానికి హాజరైన సభ్యులచే సంతకాలు తీసుకున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ చెప్పారు.

ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీని నిర్ణయించి తెలియజేస్తామన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

గంగవరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం 32 మంది చిన్నారులకు డాక్టర్ దగ్గుబాటి రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 115 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఒ.భావన చెప్పారు. ఎవరికైనా అనారోగ్యం వస్తే తక్షణమే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని ఆమె సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ

డుంబ్రిగుడ: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాలలో సోమవారం గిరిజన చట్టాలు, వన్య ప్రాణుల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జంతువులను హింసించడం చట్టరీత్యా నేరమన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత అన్నారు. జంతువులను సంరక్షించడంపై చట్టాలు అమల్లో ఉన్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి విశాఖలోని ప్రభుత్వ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించి శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు. చికిత్స అనంతరం ముంచంగిపుట్టు తీసుకువస్తామని తెలిపారు. కంటి పరీక్షలకు వస్తున్నవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఒక జత దుస్తులు తీసుకొని రావాలని, అవసరమైన రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం: ఏజెన్సీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జెఏసీ చైర్మన్ కేతా శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో జెఏసీ స్టేట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఉద్యోగుల సమస్యలను ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జెఏసీ డిప్యూటీ కార్యదర్శి వరప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూనవరం: కూనవరం, టేకులబోరు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి 4.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాజ్‌కపూర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మెయింటెన్స్ పనులు, వీధి లైట్ల మరమ్మతుల నిమిత్తం రెండు గంటల పాటు సరఫరా నిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్నికల కోడ్ అమలుపై సమీక్ష

మారేడుమిల్లి: పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుపై ఎంపీడీవో తూతిక విశ్వనాథ్ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గ్రామాల్లో అమలు చేయడంపై ఆరా తీశారు. ఎన్నిక నియమావళిని అతిక్రమిస్తే చర్యలుంటాయని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, ఆయా పార్టీల నాయకులకు సమాచారం ఇచ్చి ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలని సూచించారు.ఎన్నికల కోడ్‌కు రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం, నగదు పంపిణీ చేయవద్దని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏఓ రత్నకుమారి తదితరులున్నారు.

కూటమి నాయకుల తీరుపై ధ్వజం

సీలేరు: సీలేరులో బస్ షెల్టర్ నిర్మాణాన్ని కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని బీసీ సెల్ కార్యదర్శి కారె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జి.కె.వీధి మండలం సీలేరులో మేజర్ పంచాయతీలో బస్సు షెల్టర్, మరుగుదొడ్ల లేక ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ఏపీ జెన్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్థలాన్ని మంజూరు చేయగా, పంచాయతీ, ఎంపీ నిధుల నుంచి సొమ్ము విడుదలైందన్నారు. అయితే ఈ క్రమంలో కూటమి నాయకులు బస్ షెల్టర్ నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆయన చెప్పారు.

ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణంపై దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని లేనిపక్షంలో స్థానికులతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

చిన్నారులకు పోషకాహారం తప్పనిసరి



చిన్నారుల ఆరోగ్యభద్రతపై తల్లులకు సూచనలిస్తున్న సీడీపీవో లక్ష్మి

గంగవరం: బరువు తక్కువ ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులకు మంచి పోషకాహారం ఇవ్వాలని గంగవరం సీడీపీవో సీహెచ్.లక్ష్మి అన్నారు. గంగవరం -2 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. రికార్డులు, స్టాకు తనిఖీ చేశారు.ఐదేళ్లలోపు చిన్నారుల బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు పెరిగేందుకు తల్లులు తమ పిల్లలకి మంచి పోషకాహారం అందజేయాలని సూచించారు. వైద్యులతో ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. పిల్లలకు ఆహారం ఇచ్చే ముందు పరిశుభ్రత పాటించాలన్నారు. అవసరమైన చిన్నారులను ఎన్ఆర్‌సీ(న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్)లో చేర్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ సత్యవతి, మహిళా సంరక్షణ కార్యదర్శి గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఔదార్యం



బాధితులకు సాయం అందిస్తున్న నాయకులు

ఎటపాక: మండలంలోని నల్లకుంట గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ప్రమాద విషయాన్ని ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లడంతో వారు స్పందించారు. వారి సహకారంతో బియ్యం, నిత్యావసర సరకులు, కొంత నగదును బాధిత కుటుంబాలకు నాయకులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఔదార్యంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని, వారికి గృహాలను మంజూరు చేయాలని కోరారు. నల్లకుంట సర్పంచ్ తెల్లం రాములమ్మ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరామారావు, రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, గుండాల ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ తోట శశికుమార్, ముత్తిబోయిన రాము, దార రవి, కోడూరి నవీన్, దారా రమేష్, కుర్సం రాజశేఖర్, తెల్లం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ పాలిటెక్నిక్ క్రీడల్లో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు



వ్యవసాయ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రంపచోడవరం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో రంపచోడవరం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు సత్తా చాటారు. నంద్యాల జిల్లా మహానందిలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన ఈ పోటీల్లో వాలీబాల్ విభాగంలో రంపచోడవరం విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. షటిల్, క్రికెట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సుధాకర్, పీడీ సీహెచ్.రాజన్నదొర, పర్యవేక్షణ అధికారి ఎ.గణేష్‌లను అభినందించారు. కళాశాల ప్రాంగణంలో క్రీడా వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు



అరకు చలి ఉత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతులమీదుగా మెమెంటో అందుకుంటున్న రంపచోడవరం డీఎడ్ విద్యార్థులు

రంపచోడవరం: అరకు చలి ఉత్సవాల్లో రంపచోడవరం ప్రభుత్వ డీఎడ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయా విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభను కనబరచడంతో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీడీ విజయశాంతి తదితరులు అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రికల్, ప్లంబర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: ఎలక్ట్రికల్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(నాక్) ఏడీ రవికుమార్ సోమవారం తెలిపారు.

మండల కేంద్రంలోని నాక్ శిక్షణా కేంద్రంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 15–45 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి చదివిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు.

ఎలక్ట్రికల్ కోర్సు వివరాలకు 9394885164, ప్లంబర్ కోర్సుకు 7075340910 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

టెన్త్ పరీక్షలకు నాలుగు కేంద్రాలు

రాజవొమ్మంగి: పది పరీక్షల కోసం మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. రాజవొమ్మంగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, సింగంపల్లిలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, జడ్డంగి ఆశ్రమ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా విద్యాశాఖ ప్రకటించిందన్నారు. మండలంలోని 11 పాఠశాలలకు చెందిన మొత్తం 527 మంది పది పరీక్షలు రాయనున్నారు.

సారా బట్టీలు ధ్వంసం

గంగవరం: మండలంలోని సూరంపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై సోమవారం దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ ప్రాంతంలో సారా తయారీ జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శ్రీధర్ హెచ్చరించారు.

డీఎడ్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



ముర్రం తనూష



విజయభాస్కర్



రాధాబాయి

రంపచోడవరం: రంపచోడవరంలోని ప్రభుత్వ శిక్షణ కళాశాల (డీఎడ్ కళాశాల) 2023-25 విద్యా సంవత్సరంలోని 2వ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. డీఎడ్ ఫలితాలకు సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు సోమవారం వెల్లడించారు.

కళాశాల నుంచి 18 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18 మంది ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. వీరిలో ముర్రం తనూష 700 మార్కులకు 623 సాధించి 89 శాతం సాధించినట్టు పేర్కొన్నారు. అలాగే బోయిన విజయ భాస్కర్-617, మడకం రాధాబాయి-615 మార్కులు సాధించి రెండు, మూడో స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీడీ విజయశాంతిలు అభినందించారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పోలీసు బందోబస్తు నడుమ జీడి తోటల వేలం



అటవీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

నర్సీపట్నం: నర్సీపట్నం అటవీ డివిజన్ పరిధిలోని జీడి మామిడి తోటలకు పోలీసు బందోబస్తు నడుమ సోమవారం అటవీ అధికారులు వేలం నిర్వహించారు. అటవీ భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్న పలువురు ఇటువంటి సమయంలో నిరసన వ్యక్తం చేస్తుంటారు. అటువంటి సంఘటనలు తలెత్తకుండా టౌన్ ఎస్ఐ రమేష్, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పెడిమికొండ 5,200, టి.జగ్గంపేట 8,700, చినరాచపల్లి 220, ఆరిలోవ 48 జీడి చెట్లకు వేలం నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో సునీల్, రేంజర్ లక్ష్మీనర్సు సమక్షంలో వేలం నిర్వహించారు.

పది మద్యం బాటిళ్ల పట్టివేత

బుచ్చెయ్యపేట: మండలంలోని బుచ్చెయ్యపేట రోడ్డులో పది మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీలో భాగంగా బంగారుమెట్టకు చెందిన వ్యక్తి బుచ్చెయ్యపేట నుంచి 10 మద్యం బాటిళ్లతో వెళ్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్



సరియవలసలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి గిరిజన సంఘం నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ 2024లో తవ్వించిన బోరు ద్వారా నీరందక నిరుపయోగంగా మారిందని, దీంతో స్థానికులు దాహార్తికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవి సమీపిస్తుండటంతో తాగునీరు లేక గ్రామస్తులు అల్లాడుతున్నారని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పాడైన బోరును బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. తిలక్, శ్రీనివాసరావు, రాందాస్, సీతారాం, పిజగత్, తిరుపతి, నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



చింతపల్లి లో చిన్నారులకు అక్షరాభ్యాసం

చింతపల్లి/సీలేరు/రాజవొమ్మంగి: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాలు, పాఠశాలల్లో సరస్వతి దేవికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. తల్లిదండ్రులు, చిన్నారులతో ఆలయాలు కళకళలాడాయి. ఇందులో భాగంగా చింతపల్లిలోని బీవీకే పాఠశాలలో జరిగిన వేడుకలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పురోహితులు సాయి, నిర్వాహకులు పాల్గొన్నారు. సీలేరులోని డీఏవీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కిరణ్‌కుమార్ విద్యార్థులతో సరస్వతి దేవికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు సరస్వతి దేవి చిత్రపటాలను పంపిణీ చేశారు. రాజవొమ్మంగిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సరస్వతి దేవికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పురోహితుడు భానుమూర్తి జరిపించారు.



రంపచోడవరంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీలేరులో పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేడు బంగారమ్మతల్లి తీర్థం

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారంలో మంగళవారం బంగారమ్మతల్లి అమ్మవారి తీర్థం జరగనుంది. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు తీర్థం చేయనున్నారు. బంగారమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలను జరిపేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.